సాక్షి
తిరుపతి

శనివారం । 17 । ఆగస్టు । 2024



మరో 'గ'ఘన' విజయం

షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి ప్రవేశపెట్టిన ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం విజయవంతమైంది. - 8లో



వైభవంగా తులసీ మహాత్మ్యం

గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం తులసీ మహాత్మ్యం వేడుకను వైభవంగా నిర్వహించారు. - 8లో



శ్రీవారికి కొప్పెర వితరణ

తిరుమల శ్రీవారికి తిరుపతికి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన ఓ కుటుంబం కొప్పెరను వితరణగా అందజేసింది. - 8లో

న్యూస్‌రీల్

విద్యార్థుల అస్వస్థతపై విచారణ



సూచనలిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్

రేణిగుంట: రేణిగుంట బీసీ బాలుర హాస్టల్‌లో 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై శుక్రవారం రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున్ విచారణ చేపట్టారు. ఆయన రేణిగుంటలోని బీసీ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులను విచారించారు. బయట ఆహారాన్ని ఇకపై అనుమతించొద్దని సిబ్బందిని హెచ్చరించారు. మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. హాస్టల్‌లో సిబ్బంది కొరత, మరుగుదొడ్ల సమస్యను విద్యార్థులు ఆయనకు విన్నవించారు. జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి చంద్రశేఖర్, డివిజనల్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, హాస్టల్ వార్డెన్లు పల్లా వెంకటేశ్వర్లు, చైతన్య పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో వైద్య సేవలు నిలిపివేత

తిరుపతి తుడా: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలు పై సామూహిక అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు తిరుపతి నగరంలోని అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపేస్తున్నట్లు ఐఎంఏ తిరుపతి శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సాక్ష్యలను బెదిరిస్తూ అల్లరి మూకలు ఆస్పత్రిలో దాడులు చేయడం సిగ్గుమాలిన చర్యగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్, కార్యదర్శి వెంకటరమణ అభివర్ణించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కేవలం అత్యవసర వైద్యసేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయని, మిగిలిన అన్ని వైద్య సేవలను పూర్తిస్థాయిలో నిలిపిస్తున్నట్లు వారు ప్రకటించారు.

అశ్వ వాహనంపై వీరభద్రుడు



నారాయణవనం: టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవర్లు అశ్వ వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు. శనివారం ఉదయం వీరఖడ్గ స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

తలసరి ఆదాయంలో ఐదో స్థానం



మాట్లాడుతున్న జిల్లా అర్థ గణాంకశాఖ అధికారి సాంబశివారెడ్డి

తిరుపతి అర్బన్: రాష్ట్ర తలసరి ఆదాయంలో తిరుపతి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో ఉందని జిల్లా అర్థ గణాంకశాఖ అధికారి సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వికసిత్ భారత్–2047లో భాగంగా ఏపీ అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–29కి సంబంధించి 15శాతం వృద్ధి రేటు సాధించడానికి అవసరమైన మేరకు నమూనాలు తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర ఆదాయంలో తిరుపతి జిల్లా వాటా 5.18 శాతం మాత్రమే ఉందని, దీన్ని 6శాతానికి తీసుకుపోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంతో పోల్చుకుంటే తిరుపతి జిల్లా వ్యవసాయ రంగంలో 12,883 కోట్లతో 18వ స్థానంలోను, పారిశ్రామిక రంగంలో 24,505 కోట్లతో 2వ స్థానంలోను, సేవా రంగంలో 16,210 కోట్లతో 4వ స్థానంలో కొనసాగుతోందని వివరించారు. అర్థ గణాంకశాఖ కార్యాలయపు సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు, డీపీఓ ప్రసాద్‌రావు, డీఈవో శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగరాజు, సెరికల్చర్ అధికారి గీతారాణి, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, పశు సంవర్ధకశాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

• వ్రతం.. భక్తజనపావనం!



స్వర్ణరథంపై ఊరేగుతున్న సిరుల తల్లి (ఇన్‌సెట్) వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం విశేషంగా ఆకట్టుకుంది. మండపంపై భాగంలో గజలక్ష్మీ అమ్మవారు, కింది భాగంలో రెండు వైపులా ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం అమ్మవారు స్వర్ణ రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

– తిరుచానూరు(చంద్రగిరి)

• సిరుల తల్లి.. ప్రణమిల్లి!



విశేష అలంకరణలో అమ్మవారు



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా వేసిన చలువు పందిళ్ల కింద మహిళలు పెద్ద సంఖ్యలో నోము నోచుకున్నారు. వేదికపై లక్ష్మీదేవి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

అన్నార్పణం

అన్న క్యాంటీన్ల పేరుతో కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదివరకు ఉన్న రేకుల షెడ్లు, భవనాలకు చిన్నపాటి మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన మున్సిపల్, కార్పొరేషన్ సాధారణ నిధులను మింగేస్తున్నారు. కూటమి పెద్దల మౌఖిక ఆదేశాలతో అధికారులు సైతం పనులను అంచనా వేయకుండా సంతకాలు పెట్టి చెక్కులిచ్చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రెండంతస్తుల శాశ్వత సచివాలయ భవనానికి రూ.40 లక్షలు వెచ్చించగా.. నేడు తాత్కాలిక షెడ్లలో ఏర్పాటు చేసే అన్న క్యాంటీన్ మరమ్మతులకు రూ.20 లక్షల వరకు ఖర్చుచేస్తున్నారు. పసుపు రంగు అద్ది ప్రచార పర్వానికి తెరలేపుతున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేత అయిన డెప్యూటీ సీఎం ఫొటో లేకుండానే ఊదరగొట్టుకుంటున్నారు. దీనిపై జనసైనికులు సైతం రగిలిపోతున్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టడంలో తప్పులేదు గానీ.. ఇలా ప్రభుత్వ నిధులు ఇష్టారాజ్యంగా దోచిపెట్టడమేంటని పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, ఏర్పాట్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి



తిరుపతిలోని బైరాగిపట్టెడ ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పసుపు రంగులతో అన్న క్యాంటీన్ ఏర్పాటు

అన్న క్యాంటీన్ల రిపేర్ల పేరుతో తమ్ముళ్ల జేబుల్లోకి ప్రభుత్వ నిధులు

- రూ.3 లక్షలయ్యే రిపేర్లకు రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షలు
- కార్పొరేషన్, మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి కేటాయింపు
- నాటి టీడీపీ హయాంలో ఒక్కో క్యాంటీన్‌కి రూ.30 లక్షలు
- ఒక్కో రేకుల షెడ్డుకి రూ.50 లక్షల వరకు ఖర్చు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండంతస్తుల సచివాలయ శాశ్వత భవనానికి రూ.40 లక్షలే
- పేదల భోజనం పేరుతో తమ్ముళ్లకు దోచిపెడుతున్న కూటమి పెద్దలు
- డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనసైనికులు

గ్రౌండ్ రిపోర్ట్

2014-2019 మధ్య ప్రారంభమైన అన్న క్యాంటీన్లు

ప్రాంతం	ఒక్కో క్యాంటీన్‌కి కేటాయించిన మొత్తం	ప్రాంతం	ఒక్కో క్యాంటీన్‌కి కేటాయించిన మొత్తం
తిరుపతిలో 4	రూ.1.12 కోట్లు	నగరి	రూ.30లక్షలు
చిత్తూరు	రూ.30 లక్షలు	పుత్తూరు	రూ.30 లక్షలు
కుప్పం	రూ.30 లక్షలు	శ్రీకాళహస్తి	రూ.30 లక్షలు
పుంగనూరు	రూ.30 లక్షలు	పలమనేరు	రూ.30 లక్షలు
మొత్తం రూ.3.3 కోట్లు			

రిపేర్లకే ఇన్ని లక్షలా?



పుంగనూరులో అన్న క్యాంటీన్

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని 16 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రిపేర్ల పేరుతో ఎంతైనా ఖర్చు చేసుకునేలా ఆదేశాలిచ్చారు. అందులో భాగంగా రూ.5 లక్షల నుంచి ఎంత ఖర్చయితే అంత కాంట్రాక్టర్‌కి చెల్లించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదే అదునుగా అన్న క్యాంటీన్ కాంట్రాక్టర్లు (టీడీపీ శ్రేణులు) రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చుచేస్తున్నట్లు లెక్కలుగడుతున్నారు. ఈ నిధులన్నీ కార్పొరేషన్, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. వీటికి వెచ్చించే నిధులు మొత్తం రూ.2.08 కోట్ల నుంచి రూ.3.2 కోట్ల దాకా ఉంటోంది.

ఈనెల 16న ప్రారంభించిన క్యాంటీన్లు

- కుప్పం, పలమనేరు, పుంగనూరు
- నాటి టీడీపీ ప్రభుత్వం.. నేటి కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లకు వెచ్చించిన నిధులు: రూ.5.38 కోట్ల నుంచి రూ.6.5 కోట్ల వరకు
- రూ.50 లక్షలు వెచ్చించిన అన్న క్యాంటీన్ స్వరూపం
- నాలుగు గోడలు, పైన పది రేకులు, నాలుగువైపులా నాలుగు అద్దాలు
- నిల్చొని భోజనం చేసేందుకు రెండు, మూడు టేబుళ్లు
- మొత్తంగా తాత్కాలిక షెడ్డు

ప్రచారమంటే 'పచ్చ రంగుపడుద్ది'

పేదలకు భోజనం పెట్టటం దేవుడెరుగు.. ఆ పేరుతో టీడీపీ ప్రచారం చేసుకునేందుకు అన్న క్యాంటీన్లకు పచ్చ రంగులు వేయడంపై ఆ పార్టీ నేతలు శ్రద్ధ చూపుతున్నారు. అందులో భాగంగానే అన్న క్యాంటీన్లు అన్నింటికీ పచ్చ రంగులు వేస్తున్నారు. గత ప్రభుత్వంలో కొన్ని భవనాలకు బ్లూ, తెలుపు రంగులు వేస్తే కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలమైన రంగులు వేస్తోందంటూ రాద్ధాంతం చేశారు. మరి నేడు టీడీపీ శ్రేణులు చేస్తున్నదేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తిరుపతి ముత్యాలరెడ్డిపల్లెలో..



శ్రీకాళహస్తిలోని అన్న క్యాంటీన్

రూ.40 లక్షలతో గ్రామ, వార్డు సచివాలయాలు



సిమెంటు కాంక్రీట్‌తో నిర్మించిన రెండంతస్తుల శాశ్వత భవనం. పంచాయతీరాజ్‌శాఖ పూర్తిచేసిన ఈ భవనంలో కింద పోర్షన్‌లో నాలుగు గదులు. పైన అంతస్తులో మరో నాలుగు గదులు. గ్రామ, వార్డులో ఉన్న వారితో సమావేశం కావడానికి అనుకూలంగా మీటింగ్ హాలు. ఇంకా స్థానిక సర్పంచ్‌కి ఓ గది. ప్రభుత్వంలో ఉన్న వివిధ శాఖలకు వేర్వేరు గదులు. సచివాలయంలో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు, ప్రింటర్, యూపీఎస్, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలు, ఫ్యాన్లు ఇతరత్రా. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా.. కార్పొరేట్ స్థాయిలో రూ.40 లక్షలు వెచ్చించి సచివాలయాల కోసం భవనాలను నిర్మించింది. ఒక్కో సచివాలయంలో 250 కుటుంబాల నుంచి 500 కుటుంబాల వారు సేవలు పొందుతున్నారు.

గతంలో 16 అన్న క్యాంటీన్లు



కుప్పంలో..

అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడుతోంది. గత టీడీపీ పాలనలో చూస్తే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మొత్తం 16 అన్న క్యాంటీన్లు ఉండేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి పట్టణాల్లో క్యాంటీన్లను ప్రారంభించనుంది. మొదటి విడతలో తిరుపతి జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభానికి నోచుకోలేదు.

అన్న పేరుతో తమ్ముళ్లకు విందు



గత టీడీపీ పాలనలో తాత్కాలిక షెడ్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లు నేడు అలానే ఉన్నాయి. అయితే వాటికి ఉన్న పచ్చ రంగులు మాత్రం లేవు. ప్రస్తుతం రిపేర్ల పేరుతో భారీగా నిధులు ఖర్చుచేస్తున్నారు. రంగులు, ఇతరత్రా వాటిని బాగుచేయాలంటే గట్టిగా అంటే రూ.3 లక్షలు ఎక్కువ. అటువంటిది రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చయినట్టు లెక్కలు గడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రూ.3.3 కోట్లు వెచ్చించి బిల్లులు చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం బాగున్నా.. వాటి రిపేర్ల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.



పలమనేరులోని అన్న క్యాంటీన్

పవన్ ఫొటో ఎగ్గొట్టేశారు!

ప్రభుత్వంలో కూటమి నేతలంతా సమానమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు చెప్పుకుంటూ వచ్చిన విషయం తెలిసిందే. ఏదైనా తేడా వస్తే ప్రభుత్వానికి ఇబ్బంది తప్పదని భావించిన టీడీపీ ముఖ్యనేతలు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటోతో పాటు పవన్‌కళ్యాణ్ ఫొటో కూడా ఏర్పాటు చేశారు. అయితే నేడు ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్లపై ఎన్టీఆర్, చంద్రబాబు ఫొటోలు తప్ప ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటో ముద్రించలేదు. దీనిపై జనసేన నాయకులు మండిపడుతున్నారు. అప్పుడే పవన్ కళ్యాణ్ అంటే విలువ లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదలు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయండి

నేడు అట్టహాసంగా ప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లు అత్యవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి రుయా, తుడా కూడలి, ఆటోనగర్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువ మంది చిరు వ్యాపారులు, కార్మికులు అధికంగా ఉంటారు. అదేవిధంగా తిరుపతి రుయా ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు వచ్చి వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే రోగులు, వారి కుటుంబీకులకు అనుకూలంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.



తిరుపతిలో స్విమ్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్

నిరసనల హోరు



ర్యాలీగా తరలివస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

తిరుపతి తుడా: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వాస్పత్రి వైద్యురాలుపై జరిగిన అమానుష ఘటనను వ్యతిరేకిస్తూ తిరుపతిలో వైద్యులు రోడ్డెక్కారు. శుక్రవారం తిరుపతిలోని రుయా, స్విమ్స్ ఆస్పత్రుల వైద్యులు కదం తొక్కారు. నిందితుల పట్ల అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైద్యులు దుమ్మెత్తిపోశారు. స్విమ్స్ నుంచి మహర్షి విగ్రహం కూడలి వరకు వైద్యులు ర్యాలీగా తరలివచ్చారు. వైద్య విద్యార్థులు మాట్లాడుతూ అత్యంత ఘోరంగా వైద్యవిద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం నుంచి 24 గంటల పాటు పూర్తిస్థాయిలో వైద్య సేవలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

సమాచారం ఇవ్వండి

తిరుపతి అర్బన్: జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా మాన్యువల్ స్కావెంజర్స్‌తోపాటు ఇన్సానిటరీ లెట్రిన్స్ ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు డాక్టర్ బలరాంసింగ్ కేసుకు సంబంధించి 2023లో ఇచ్చిన తీర్పు మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్‌తోపాటు ఇన్సానిటరీ లెట్రిన్స్‌కి సంబంధించి సర్వే నిర్వహించామని చెప్పారు. అయితే సర్వేలో అలాంటివి లేవని అధికారులు నివేదిక ఇచ్చారని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఏ ప్రాంతంలోనైనా ఉంటే ఈ నెల 30వ తేదీలోపు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

డిగ్రీ వార్షిక ప్యాటర్న్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో వార్షిక ప్యాటర్న్ (ఇయర్లీ ఎగ్జామ్స్ పాత పద్ధతిలో)లో పలు డిగ్రీ కోర్సుల్లో తప్పిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలను చివరిసారి నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ తెలిపారు. 1990–91 నుంచి 2014–15 వరకు డిగ్రీ పూర్తి చేసి పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారి కోసం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు చివరి అవకాశం కల్పించినట్టు తెలిపారు. వారు సెప్టెంబర్ 30వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఒక పేపర్‌కు రూ.2 వేలు, రెండు పేపర్లకు రూ.3 వేలు, మూడు, అంతకంటే ఎక్కువ పేపర్లు తప్పిన వారు రూ.4 వేలు చెల్లించాలని సూచించారు. దరఖాస్తులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నాయని, పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.72,690
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,584
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.84,100
రిటైల్ వెండి గ్రాము	రూ.87.10

క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణకు మొక్కుబడిగా దరఖాస్తులు

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత శిక్షణకు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల నుంచి మొక్కుబడిగా దరఖాస్తులు అందాయి. డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి సూర్యనారాయణ ఈ నెల 10వ తేదీన ఓ ప్రకటన విడుదల చేశారు. 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అయితే త్రం 5 గంటలకు గడువు ముగిసే సమయానికి 6 దరఖాస్తులు మాత్రమే అందాయిని గిరిజన సంక్షేమ సాధికారిత విభాగం సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్య తెలిపారు.

జూలైలో 300 దరఖాస్తులు

తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని గత నెలలో ఓ ప్రకటన విడుదల చేశారు. జూలై 3 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అప్పటి జేసీ పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి 300 దరఖాస్తులు రాగా.. ఆగస్ట్ 1 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం కాలేదు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 79,695 మంది స్వామిని దర్శించుకున్నారు. 34,395 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అంతకన్నా ముందే వెళ్లితే లోపలికి అనుమతించబోమని వెల్లడించింది.

మరో గఘన విజయం

- ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం విజయవంతం
- ఇస్రో అమ్ములపొదిలో వజ్రాయుధం ఎస్ఎస్ఎల్వీ రాకెట్
- వాణిజ్యపరమైన ప్రయోగాల వైపు ఇస్రో చూపు

సూళ్లూరుపేట: షార్‌లో మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగంతో మరో 'గఘన' విజయాన్ని నమోదు చేశారు. స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ డీ3) ప్రయోగానికి శుక్రవారం వేకువజామున 2.17 కౌంట్‌డౌన్‌ను ప్రారంభించి ఉదయాన్నే 9.17 గంటలకు ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రయోగం ద్వారా రెండు ఉపగ్రహాలను భూమికి అతి తక్కువ దూరంలోని 475 కి.మీ ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇప్పటి దాకా ఐదు రకాల రాకెట్‌లను రూపొందించుకుని దేశీయ ఉపగ్రహాలు, వాణిజ్యపర ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వచ్చారు. ఎస్ఎస్ఎల్వీ రాకెట్ విజయవంతం కావడంతో ఆరో రాకెట్‌గా ఇస్రో అమ్ముల పొదిలో మరో వజ్రాయుధం చేరింది. ఇక నుంచి ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల స్పీడ్ కూడా పెరిగే అవకాశం లేకపోలేదు.

అత్యంత తక్కువ వ్యయం..ఆరోరకం!

అత్యంత తక్కువ వ్యయంతో విదేశాలకు చెందిన బుల్లి ఉపగ్రహాలతో పాటుగా ఒక మోస్తరు బరువున్న ఉపగ్రహాలను, దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ విద్యార్థులు ప్రయోగాత్మకంగా తయారు చేసిన ప్రయోగించేందుకు ఇప్పటి దాకా పీఎస్ఎల్వీ రాకెట్‌ను ఉపయోగించేవారు. దీనికంటే కూడా ఇంకా తక్కువ వ్యయంతో చిన్న తరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించేందుకు ఒక చిన్న రాకెట్‌ను రూపొందించేందుకు 2016లోనే ప్రణాళిక‌ను రచించారు. 2020లోనే ఈ ప్రయోగాన్ని నిర్వహించాలనుకున్న సమయంలో కరోనా మహమ్మారి వల్ల ప్రయోగం ఆలస్యమైంది. చిన్న తరహా ఉపగ్రహాలను ఈ స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్‌ను డిజైన్ చేశారు. అయితే 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ డీ1 పేరుతో చేసిన ప్రయోగమంతా విజయవంతంగా నిర్వహించినప్పటికీ ఉపగ్రహాలు కూడా కక్ష్యలోకి ప్రవేశించినట్టుగా గ్రౌండ్‌స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. మరు నిమిషంలో ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందకపోవడంతో ఈ ప్రయోగం విఫలమైనట్టుగా ఇస్రో ప్రకటించింది. ఆ ప్రయోగంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని 2023 ఫిబ్రవరి 10న అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలను రూపొందించుకుని ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్‌ను ప్రయోగించి విజయాన్ని నమోదు చేసుకున్నారు. అదే విధంగానే ఎస్ఎస్ఎల్వీ డీ3లో కూడా అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి విజయాన్ని నమోదు చేసుకున్నారు. దీంతో ఇస్రోకు ఆరోరకం రాకెట్‌గా ఎస్ఎస్ఎల్వీ ఇస్రో జాబితాలో చేరింది. ఇప్పటిదాకా ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మార్క్3 రాకెట్లను మాత్రమే డిజైన్ చేశారు. సరికొత్తగా ఎస్ఎస్ఎల్వీ కూడా ఇస్రో జాబితాలో చేరింది.


రాకెట్ ప్రయోగమిలా...

- ఎస్ఎస్ఎల్వీ డీ3 రాకెట్ 34 మీటర్లు పొడువు, రెండు మీటర్లు వెడల్పు
- 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లో 16.56 నిమిషాలకు ప్రయోగాన్ని పూర్తి
- 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 130 సెకండ్లకు మొదటి దశను విజయవంతంగా పూర్తి
- 162.3 సెకండ్లకు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ విడిపోవడం
- 7.7 టన్నుల ఘన ఇంధనంతో 405.3 సెకండ్లకు రెండో దశ పూర్తి
- 4.5 టన్నుల ఘన ఇంధనంతో 698.5 సెకండ్లకు పూర్తి
- నాలుగో దశలో వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌లో నింపిన 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 706.7 సెకండ్లకు కటాఫ్
- వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌ను కటాఫ్ చేసిన తరువాత 816.6 సెకండ్లకు 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాన్ని భూమికి 475 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి మొదటిగా విజయవంతంగా ప్రవేశపెట్టడం
- 16.56 నిమిషాలకు ఎస్ఆర్-0 డెమో శాట్‌ను కూడా విజయవంతంగా ప్రవేశపెట్టి ప్రయోగాన్ని అనుకున్నది అనుకున్నట్టుగా నిర్వహించారు.
- కక్ష్యలోకి చేరుకున్న ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడం, ఉపగ్రహాలకు సోలార్ ప్యానెల్స్ విచ్చుకోవడం వంటివి జరగడంతో ఉపగ్రహాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.
- షార్ నుంచి 94వ ప్రయోగం ఎస్ఎస్ఎల్వీ డీ3 రాకెట్.
- ఎస్ఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది మూడో రాకెట్.


నిప్పులు చిమ్ముకుంటూ నింగివైపు వెళుతున్న ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్


మొదటి దశలో మండుతూ వెళ్లి ఆగిపోయిన రాకెట్


రెండో దశలో మండుకుంటూ వెళుతున్న రాకెట్


రాకెట్‌కు శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ ఊడిపోతున్న దృశ్యం


మూడో దశలో మండుతూ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న రాకెట్


వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్ నుంచి కక్ష్యలోకి విడిపోతున్న ఈఓఎస్-08 ఉపగ్రహం

అయలాం సుజాతకు యోగారత్న అవార్డు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన అయలాం సుజాతకు యోగారత్నం అవార్డు లభించింది. తమిళనాడులోని గుమ్మిడిపూడిలో కైరాయి యోగా విద్యాపీఠంలో గురువారం తమిళనాడు యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా 18వ యోగా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎంతో మంతికి శిక్షణ ఇస్తూ యోగా తీర్చిదిద్దుతున్న యోగా మాస్టర్ అయలాం సుజాతకు యోగా రత్న అవార్డును అందజేశారు.


అవార్డు అందుకుంటున్న సుజాత

వేతనాలు చెల్లించకుండా వేధింపులు


దీక్ష చేపట్టిన పారిశుద్ధ్య కార్మికులు, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి తుడా : తిరుపతి రుయా, మెటర్నటీ, ఎస్వీ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఏ వన్ సర్వీసెస్ కాంట్రాక్ట్ వేధిస్తోందని ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను చేపట్టిన కాంట్రాక్టు సంస్థ కార్మికులతో దారుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్కువ మందితో పనిచేయిస్తూ, ఎక్కువ మంది పేరిట జీతాలు కాజేస్తోందని ఆరోపించారు. సదరు సంస్థ ఆధారాలతో పట్టుబడినా అధికారులు వారితో కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పెండింగ్ వేతనాలను చెల్లించాలని, ప్రభుత్వం నిబంధనల మేరకు కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌డీ రవి, చిన్నం పెంచలయ్య, మణి, మహేంద్ర, రాజా , నరసింహులు, ప్రమీల, ఉదయ్ , జ్యోతి, పార్వతి, రమాదేవి, వనజ పాల్గొన్నారు.

ఆరుగురు స్మగ్లర్ల అరెస్ట్


స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లో నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనంతో పాటు ఆరుగురు స్మగ్లర్లను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ కే.సురేష్ బాబు భాకరాపేట అటవీ ప్రాంతంలో కోటకాడపల్లి, ఉస్తికాయల పెంట మీదుగా ఫించా వైపు కూంబింగ్ చేస్తూ వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయలపెంట ఎస్టీ కాలనీ చేరుకోగా, అక్కడ కొంతమంది కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని టాస్క్ ఫోర్సు అధికారులు చుట్టుముట్టారు. అనంతరం తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన అనుమాన్ (42), సేంజి వేడి (26), చిన్న వేడి (22), మురుగేశన్ (32), ఆయనార్ (23), శివానందం (37)గా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి కారు, మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి కొప్పెర విరాళం

తిరుమల: తిరుమల శ్రీవారికి తిరుపతి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కామినేని సాయి, కుమార్, కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు కొప్పెర (హుండీ)ను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం ఈ మేరకు అదనపు ఈఓకు అందజేశారు.

వచ్చేనెల 2 నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 2 నుంచి 6 విభాగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇందులో ఎలక్ట్రికల్ క్యాడ్, ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్(పీఎల్‌సీ), సాలిడ్ ఎడ్జ్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రోగ్రామింగ్(సీఎన్‌ఎల్‌పి), రివిట్ ఆర్కిటెక్చర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) కోర్సుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోర్సులు డిప్లమో, ఐటీఐ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు స్కిల్స్‌ను పెంపొందించుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. 90 గంటల కాలవ్యవధితో శిక్షణ ఇచ్చే ఈ కోర్సులకు ఒక్కోదానికి రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సాంకేతిక విద్యాశాఖ సర్టిఫికెట్లను అందజేస్తుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు ఐఆర్‌జీ ల్యాబ్ ఇన్‌చార్జ్ కమల్‌ను 99851 29995లో సంప్రదించాలని కోరారు.

గిరిజనుల జీవనోపాధికి కృషి


ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి(అలిపిరి): గిరిజనుల జీవనోపాధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో జిల్లాలోని ఎస్టీకుల సంఘాలతో సమావేశమయ్యారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు గుండాల్ నాయక్ మాట్లాడుతూ టీటీడీలో గిరిజనులకు 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. తిరుపతిలోని గాంధీరోడ్డులోని హథీరాంజీ దుకాణాలను సుగాలీలకు కేటాయించాలని, పాపవినాశంలోని గిరిజనుల దుకాణాలకు పెంచిన అద్దెలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. విద్యుత్ నగర్‌లో హథీరాంజీ దేవాలయం నిర్మాణానికి సహకారం అందించాలన్నారు. అలాగే స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. గిరిజన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. టీటీడీ బోర్డు మెంబర్ పోస్టును కేటాయించాలన్నారు. అలాగే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపుతానని ఎస్టీ కమిషన్ సభ్యుడు హామీ ఇచ్చారు.అనంతరం విద్యుత్ నగర్‌లో నిర్మిస్తున్న హథీరాంజీ ఆలయ పనులను పరిశీలించారు.

ఐదు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

శ్రీకాళహస్తి: ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణంలోని 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రారాజు కథనం.. దొరవారిసత్రానికి చెందిన శ్రీకాంత్ తిరుపతి జిల్లాలో రేషన్‌బియ్యం సేకరించి నెల్లూరుకు తరలిస్తున్న నేపథ్యంలో శ్రీకాళహస్తి బైపాస్ వద్ద కాపుకాచి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. లారీలో తరలిస్తున్న ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అది వాస్తవమే!

- 'సాక్షి' కథనంపై స్పందించిన రుయా సూపరింటెండెంట్

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి అత్యవసర విభాగంలో ఏసీలు పనిచేయంది వాస్తవమేనని, అయితే వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూపరింటెండెంటు డాక్టర్ రవి ప్రభు తెలిపారు. గురువారం రుయాలో «వైద్యుల తీరే వేరయా» శీర్షికన వార్త వెలువడింది. దీనిపై ఆయన ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. అత్యవసర విభాగంలో ఏసీలు మరమ్మతులకు గురైతే వాటిని మరమ్మతులు చేయించామని చెప్పారు. అత్యవసర విభాగంలో కిటికీ అద్దాలు ధ్వంసం అయినట్లు ఒప్పుకున్నారు. వాటి మరమ్మతులకు ఏపీఎంబిడీసీకి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. పారిశుద్ధ్య విభాగంలో తక్కువ మందితో పనులు చేయిస్తూ, కనీస వేతనాలు అమలు చేయకపోవడం, పారిశుద్ధ్య లోపంపై సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ఏ1 సర్వీసెస్‌కు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు. రుయా ల్యాబ్ లో మాయాజాలంపై ఫిర్యాదులు ఉన్నాయని, హెపటైటిస్ పరీక్షకు సంబంధించి తప్పుడు రిపోర్టును ఇచ్చిన విషయంపై సంబంధిత ల్యాబ్ టెక్నీషియన్ పై శాఖా పరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు.

వైభవంగా 'తులసీ మహత్యం'

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో శుక్రవారం తులసీ మహత్యం వేడుకను వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుద్ధ ద్వాదశి రోజున తులసీ ఆవిర్భావం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, విశ్వరూప దర్శనం కల్పించారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు శ్రీవారు గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహన సేవలో కళా బృందాల కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారు బంగారు వాకిలి చెంత సింహాసనంపై వేంచేపు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తులసీ మహత్యం పురాణ పఠనం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

పోలీసుల అదుపులో ప్రేమజంట

చంద్రగిరి(తిరుచానూరు): ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న ప్రేమ జంట తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి వస్తుండగా తిరుచానూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడకు చెందిన అలేఖ్య(26), శివ(33) గత 11 ఏళ్లుగా ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో వారి వివాహాన్ని పెద్దలు అంగీకరించకపోవడంతో గురువారం అన్నవరంలోని ఓ రామాలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. అయిఏత అలేఖ్య అదృశ్యమైందంటూ ఆమె తల్లిదండ్రులు భవానీ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, అలేఖ్య వివరాలను అన్ని పోలీసు స్టేషన్లకు అందించి అప్రమత్తం చేశారు. శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనార్థం కారులో వస్తున్న అలేఖ్య, శివ దంపతులను తిరుచానూరు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్థానిక పోలీసులు విజయవాడ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడి నుంచి తిరుచానూరుకు బయల్దేరారు. ఇదిలా ఉండగా ప్రేమజంట అలేఖ్య, శివ ఓ వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో విడుదల చేశారు. తమకు ఇష్టప్రకారమే ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, ఈ పెళ్లి అలేఖ్య తల్లిదండ్రులకు నచ్చకపోవడంతో తమపై పగ పెంచుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమను పోలీసులే రక్షించాలంటూ వారు ఆ వీడియోలో కోరారు. దీనిపై సీఐ సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా... విజయవాడలో అలేఖ్య మిస్సింగ్ అయ్యినట్లు కేసు నమోదైందని, దీంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించామన్నారు. వారు ప్రేమ జంటను తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.


అన్నవరంలో వివాహం చేసుకున్న శివ, అలేఖ్య

అ'పూర్వ' కలయిక

తిరుపతి కల్చరల్ : వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1969–70లో బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు 54 ఏళ్ల తర్వాత శుక్రవారం తిరుపతి వరదరాజనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కలుసుకున్నారు. ఆ సుమారు 45 మంది పూర్వ విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు గురువయ్య, శివనందాచారి, నాగయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, సుబ్బారావు, రాధాకృష్ణయ్య, సుబ్బరామయ్య కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇ.కృష్ణయ్య, గోవర్ధన్ నాయుడు, కె.చెంగల్రాయులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు